సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 6 । జూన్ । 2025



మోతాదు మించొద్దు

ఖరీఫ్‌లో పత్తి సాగు చేసే రైతులు మోతాదులో ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

10లో▸



భూములను కాపాడండి

ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

10లో▸



వీధి కుక్కల దాడి

వీధికుక్కల దాడిలో 250 నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి. రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

10లో▸

న్యూస్‌రీల్

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయకోట అన్నారు. తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల వికారాబాద్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2025లో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థినులకు మంచి అవకాశం అన్నారు. బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీ, బీఎస్సీ బీజెడ్‌జీ, బీకామ్ కంప్యూటర్, బీకామ్ బీఏ, సీఏ హెచ్‌సీఈపీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం అర్హులైన అభ్యర్థులు నేరుగా కళాశాలలో ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. పదో తరగతి మార్కుల మెమో, ఇంటర్ మార్కుల మెమో, ఇంటర్ టీసీ, 11-01-2025 తరువాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతచేసి దరఖాస్తు అందజేయాలన్నారు. వివరాలకు 98855 04397, 93985 22311 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

అసైన్డ్ భూముల పరిశీలన



అసైన్డ్ భూములను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లిలో అసైన్డ్ భూముల సేకరణ విషయంలో ఇప్పటికే గ్రామసభ పూర్తి చేశామని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని భూసేకరణకు నోటిఫికేషన్ ప్రకటించిన సర్వే నంబర్ 19,68,127లోని అసైన్డ్ భూములను గురువారం ఆయన తహసీల్దార్ అయ్యప్ప, స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. రైతుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రాణాలు పోయినా సరే తమ భూములు మాత్రం ఇచ్చేది లేదని రైతులు తెల్చి చెప్పారు.

ఇంటర్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోండి



చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల

చేవెళ్ల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఈఏడాది నుంచి ఇంటర్మీడియెట్‌కు అనుమతి లభించిందని పాఠశాల ప్రత్యేకాధికారి శ్వేతారెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎంఎల్‌టీలో 40, బైపీసీలో 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా ఇంటర్ విద్యాబోధనకు గెస్ట్ అధ్యాపకుల నుంచి తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ సబ్జెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీతోపాటు పీజీ ఉన్న వారు అర్హులని తెలిపారు. డెమో ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 91004 39368 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాబ్యానాయక్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి



బాబ్యానాయక్ (ఫైల్)

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం హేమ్లానాయక్ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాబ్యనాయక్ మృతదేహానికి గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. బతుకుదెరువు కోసం బాబ్యనాయక్ ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం కూతురు పెళ్లికోసం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లాడు. గత నెల 27న గుండెపోటుకు గురై మృతిచెందాడు. అక్కడి నుంచి మృతదేహాన్ని స్వదేశానికి తేవడం కోసం కుటుంబ సభ్యులు, తండావాసులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడి మృతదేహాన్ని తండాకు తెప్పించారు.

కడదామా.. వద్దా?

ఇందిరమ్మ ఇళ్లపై అయోమయం

- అంచనాలకు మించి నిర్మాణ ఖర్చులు
- వెనుకడుగు వేస్తున్న లబ్ధిదారులు
- ముగ్గు పోసేందుకు సైతం మొగ్గు చూపని వైనం

పైలెట్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన ఇళ్లు	
మంజూరు చేసినవి	970
మార్కింగ్ పూర్తి చేసినవి	404
మొదటి విడత నిధుల మంజూరు	148
బేస్మెట్ లెవల్‌లో ఉన్నవి	194
రూఫ్ లెవల్‌లో ఉన్నవి	23
స్లాబ్ లెవల్‌లో ఉన్నవి	08



మాడ్గుల మండలం కోల్కులపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ (ఫైల్)

దశల వారీగా చెల్లింపులు ఇలా..	
బేస్మెట్ లెవల్	రూ.1,00,000
రూఫ్ లెవల్ విత్ వాల్స్	రూ.1,00,000
స్లాబ్ లెవల్	రూ.2,00,000
నిర్మాణం పూర్తయ్యాక	రూ.1,00,000

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మెజార్టీ లబ్ధిదారులు వెనుకాడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం.. ముడి సరుకుల ధరలు అమాంతం పెరగడం.. కూలీ ఖర్చులు రెట్టింపవడం.. నిర్మాణం 400 గజాలకు మించకూడదనే నిబంధన విధించడం.. ప్రభుత్వ అంచనాలకు, క్షేత్రస్థాయిలోని ఖర్చులకు పొంతన లేకపోవడం.. వెరసి ఇంటి నిర్మాణాలకు పెద్ద అడ్డంకిగా మారింది. తీరా ప్రొసీడింగ్స్ చేతికందిన తర్వాత క్షేత్రస్థాయిలోని ఖర్చులు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీకి పొంతన లేకపోవడంతో ముగ్గు పోసేందుకే జంకుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొంతమంది అప్పు చేసి ఇళ్లు నిర్మిస్తుండగా, మరికొంత మంది ఖర్చుకు భయపడి ప్రొసీడింగ్స్ రద్దు చేసుకుంటున్నట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం పది శాతం మంది లబ్ధిదారులు కూడా తమ ఇళ్లకు ముగ్గు పోయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

చేతిలో పైసలు లేక..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 28,000 ఇళ్లను మంజూరు చేసింది. కొత్తగా నిర్మించుకునే లబ్ధిదారులకు ఈ పథకం కింద రూ.5 లక్షలు వివిధ దశల్లో చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఇంటింటి సర్వేలో భాగంగా అధికారులు అర్హుల వివరాలు సేకరించి, ఇందిరమ్మ ఇళ్ల పోర్టల్‌లో కేటగిరీల వారీగా నమోదు చేశారు. అర్హుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించారు. పూరి గుడిసెలో/శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటూ ఖాళీ స్థలాలను కలిగి ఉన్న వారికి కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలోని 16 మున్సిపాలిటీల పరిధిలో 4,969 ఇళ్లను కేటాయించగా, వీటిలో 4,701 ఇళ్లకు మాత్రమే పాలనాపరమైన అనుమతులు లభించాయి. వీటిలో 1,354 ఇళ్లకు మాత్రమే ముగ్గుపోసినట్లు సమాచారం. అదే గ్రామీణ ప్రాంతాల్లో 12,471 ఇళ్లను మంజూరు చేసినప్పటికీ 11,916 ఇళ్ల నిర్మాణానికి మాత్రమే అనుమతులు లభించాయి. వీటిలో 2,730 ఇళ్లకు మాత్రమే ముగ్గు పోశారు. ఇప్పటి వరకు కేవలం 148 మంది లబ్ధిదారులకు మాత్రమే మొదటి దశ చెల్లింపులు చేశారు. నిర్మాణానికి అవసరమైన పైసలు లేకపోవడంతో మెజార్టీ లబ్ధిదారులు నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉంటే జిల్లాలోని 21 మండలాల్లో 14 మోడల్ హౌస్‌లను నిర్మించారు. వీటిలో బేస్మెంట్ లేవల్లో ఐదు ఉండగా, స్లాబ్ లేవల్లో మరో ఐదు ఉన్నాయి. రూఫ్ లేవల్లో నాలుగు ఉండటం గమనార్హం.

నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి..

- చేవెళ్లకు 2,800 ఇళ్లు కేటాయించగా, 2,641 ఇళ్లకు పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. ఇప్పటి వరకు 557 ఇళ్లకు మాత్రమే ముగ్గు పోశారు.
- ఇబ్రహీంపట్నానికి 3,500 ఇళ్లు కేటాయించగా, 3,424 ఇళ్లకు అనుమతులు ఇవ్వగా కేవలం 991 ఇళ్లకు ముగ్గు పోశారు.
- కల్వకుర్తికి 2,150 ఇళ్లు కేటాయించగా, 2,131 ఇళ్లకు అనుమతులు లభించాయి. ఇప్పటి వరకు 519 ఇళ్లకు ముగ్గు పోశారు.
- మహేశ్వరానికి 3,390 ఇళ్లు కేటాయించగా, 3,141 ఇళ్లకు అనుమతులు దక్కాయి. వీటిలో ఇప్పటి దాకా 807 ఇళ్లకే ముగ్గు పోశారు.
- రాజేంద్రనగర్‌కు 2,100 ఇళ్లు కేటాయించగా, 1,819 ఇళ్లకు అధికారుల నుంచి అనుమతులు లభించాయి. ఇప్పటి వరకు 487 ఇళ్లకు మాత్రమే ముగ్గు పోశారు.
- షాద్‌నగర్‌కు 3,500 ఇళ్లు కేటాయించగా, 3,461 ఇళ్లకు అనుమతులిచ్చారు. 654 ఇళ్లకే ముగ్గు పోశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

- వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి
- విద్యా సంవత్సరం ప్రారంభానికి సిద్ధం కండి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యా సంస్థలు పునః ప్రారంభమయ్యే నాటికి పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గురువారం పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి వసతిపై ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలు ఈ నెల 12న ప్రారంభం అవుతున్న సందర్భంగా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరలోనే గ్రౌండ్ చేయాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంపై మాట్లాడుతూ లబ్ధిదారులు అందరూ ఒకే విధమైన యూనిట్ ఎంపిక కాకుండా చూసుకోవాలని సూచించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, హౌసింగ్ పీడీ హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వినతి



మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం ఇస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నియోజకవర్గంలోని ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అంతా పార్టీ గెలుపుకోసం కృషి చేశారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలో ఉన్న ముఖ్య నేతలకు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పట్టుబడ్డ గంజాయిని కొట్టేసి..

- బంధువు ద్వారా విక్రయం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ నిర్వాకం
- పోలీసుల అదుపులో నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: వచ్చే జీతంతో తృప్తి పడని ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ పని చేసే స్టేషన్‌లోనే గతంలో పట్టుబడిన గంజాయిని దొంగిలించి.. విక్రయిస్తూ పట్టుబడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద చోటుచేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ గురువారం వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గులామ్ సుల్తాన్ అహ్మద్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ అతను వచ్చే వేతనం సరిపోక అక్రమ మార్గం ఎంచుకున్నాడు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తూ విలాస జీవితానికి అలవాటుపడ్డాడు.

అక్కడ దొంగిలించి.. ఇక్కడ విక్రయిస్తూ

స్టేషన్‌లో గతంలో పట్టుబడిన గంజాయిని గులామ్ సుల్తాన్ అహ్మద్ దొంగిలించేవాడు. దానికి తనకు వరుసకు కుమారుడైన షాద్‌నగర్ పట్టణానికి చెందిన అంజాద్‌కు విక్రయించేందుకు అప్పగించేవాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న రూ.75 వేల విలువ చేసే కిలోన్నర గంజాయిని విక్రయించేందుకు అంజాద్ బుధవారం రాత్రి ఈద్గా సమీపంలోకి చేరుకున్నాడు. అదే సమయంలో ఎస్ఐ దేవరాజ్ అధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అంజాద్ కవర్ పట్టుకొని అనుమానాస్పదంగా తచ్చాడడం గమనించారు. అతడి వద్ద ఉన్న కవర్‌ను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో విచారించగా నేరం అంగీకరించాడు. ఈ మేరకు ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న దుకాణదారుడికి ఫైన్ వేసి రసీదు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఇబ్రహీంపట్నం: ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ కోరారు. 100 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం నాలుగోరోజు ఇబ్రహీంపట్నంలో దుకాణాలను తనిఖీలు చేసి ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న వాటికి ఫెనాల్టీ విధించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్స్ వాడకంతో పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని అన్నారు. కాలుష్య వాతావరణం ఏర్పడి మనుషులతోపాటు పశుపక్ష్యాదులపై దీని ప్రభావం పడుతుందన్నారు. దుకాణాల్లో వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్స్‌ను ఉపయోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ ప్రణవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు అవార్డులు



మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శంకర్‌పల్లి కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి/తుర్కయంజాల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉత్తమ పనితీరు కనబర్చిన మున్సిపాలిటీలకు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గత నెల 24న అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శకంర్‌పల్లి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్లు యోగేశ్, కె.అమరేందర్ రెడ్డి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ.. అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఈ అవార్డులు దోహదం చేస్తాయన్నారు.

భూ బేరం!

టార్గెట్ రూ.5,000 కోట్లు



- ఆదాయ సముపార్జనకు హెచ్ఎండీఏ ప్రణాళికలు
- ఎలివేటెడ్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు తదితర ప్రాజెక్టుల కోసం..
- మొదటి దశలో కోకాపేట్, ఇన్ముల్‌నర్వ, ఉప్పల్, తుర్కయంజాల్ ప్లాట్ల బిడ్డింగ్
- నాలుగు ప్రాంతాల్లో 385 ప్లాట్లు విక్రయానికి సిద్ధం
- రెండు, మూడు దశల్లో మరో పది ప్రాంతాల్లో స్థలాల వేలం

వివిధ ప్రాంతాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు సిద్ధంగా ఉన్న ప్లాట్లు

ఏరియా	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
కోకాపేట్	533.01	20	14	5(ఒకప్లాట్ రంగారెడ్డి కలెక్టరేట్‌కు తిరిగి ఇచ్చారు)
ఇన్ముల్‌నర్వ	92.69	327	-	-
ఉప్పల్ భగాయత్	56.39	64	23	41
తుర్కయంజాల్	9.00	34	22	12

మొత్తం హెచ్ఎండీఏ ప్లాట్లు : 1,141, రైతులకు కేటాయించినవి : 696, ఇప్పటి వరకు విక్రయించినవి : 59, అమ్మకానికి సిద్ధంగా ఉన్నవి : 385

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) మరోసారి భూ బేరానికి సన్నద్ధమవుతోంది. గతంలో వివిధ ప్రాంతాల్లో విక్రయించగా మిగిలిపోయిన స్థలాలను మరోసారి అమ్మకానికి పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాత లే అవుట్‌లలో ఉన్న స్థలాలను విక్రయించడంతో పాటు కొత్త లే అవుట్‌లను సైతం సిద్ధం చేస్తున్నారు. నగరంలో చేపట్టనున్న పలు ప్రాజెక్టుల కోసం సుమారు రూ.5,000 కోట్లు ఆర్జించడమే లక్ష్యంగా హెచ్ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు ప్రణాళికలను రూపొందిస్తోంది.

గతంలో భారీ స్పందన లభించిన ప్రాంతాల్లో..

- సికింద్రాబాద్ నుంచి డెయిరీఫాం వరకు, శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్‌లకు ప్రతిపాదనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు టెండర్లను సైతం కేటాయించారు. శామీర్‌పేట్ రూట్‌లో ఆస్తుల సేకరణ తుది దశకు చేరింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి కనీసం రూ.3000 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. అలాగే రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సైతం రెండు దశల్లో రూ.2500 కోట్ల వరకు వ్యయం కానుంది.
- హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో భాగంగా మెగా మాస్టర్‌ప్లాన్- 2050, సికింద్రాబాద్ స్కైవాక్, హుస్సేన్‌సాగర్ సుందరీకరణ, పార్కులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని భూముల అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో కొనుగోలుదార్ల నుంచి భారీ స్పందన లభించిన ప్రాంతాల్లో మిగిలిపోయిన ప్లాట్‌లను మొదట విక్రయించి ఆ తర్వాత రెండు, మూడు దశల్లో వివిధ ప్రాంతాల్లోని స్థలాలను విక్రయించనున్నారు.

మొదటి దశలో..

కోకాపేట్ నియోపాలిస్, ఇన్ముల్‌నర్వ, ఉప్పల్ భగాయత్, తుర్కయంజాల్‌లో గతంలో పెద్ద ఎత్తున స్పందన లభించింది. అప్పటి ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం లభించింది. ఉప్పల్‌భగాయత్‌లో రెండు దశల్లో ప్లాట్‌లను విక్రయించారు. కోకాపేట్‌లో ఎన్నారైలు, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణ సంస్థలు, రియల్టర్లు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ప్రస్తుతం ఈ నాలుగు ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములపై వారికి 60 శాతం ప్లాట్‌లను కేటాయించగా హెచ్ఎండీఏకు 40 శాతం ప్లాట్‌లు లభించాయి.వాటిలో మరో 385 ప్లాట్‌లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెండు, మూడో దశల్లో..

మొదటి దశలో కొనుగోలుదారులు, వివిధ వర్గాల నుంచి లభించే స్పందన మేరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ కొనసాగించనున్నారు. ఈ క్రమంలో బుద్వేల్, ప్రతాపసింగారం, బహదూర్‌పల్లి, హకీంపేట్, షేక్‌పేట్‌లలోని హుడాహైట్స్, కంది, కుత్బుల్లాపూర్, పెద్దకంజర్ల, ఫసల్‌వాడి, తదితర ప్రాంతాల్లో లే అవుట్‌లను అభివృద్ధి చేసి ప్లాట్‌లను విక్రయించనున్నారు.



దశలవారీగా విక్రయించేందుకు హెచ్ఎండీఏ లే అవుట్‌లు..

ఏరియా	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
లేమూరు	83.47	164	-	164
తొర్రూరు	117.375	885	392	493
కుర్మల్‌గూడ	16.75	145	86	59
బాచుపల్లి	27.36	206	204	2
మేడిపల్లి	53.21	208	91	117 (కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉన్నాయి.)
మోకిల	165.37	908	189	719 (కొన్ని స్థలాల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది.)
బుద్వేల్	182.10	17	12	4
ప్రతాప సింగారం	126.12	24	-	24
బహదూర్‌పల్లి	40.00	221	152	69
హుడా హైట్స్	12.45	37	-	37
కంది	47.14	341	-	341

ప్రభుత్వ భూములను కాపాడండి



డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రెవెన్యూ సదస్సులో తోల్‌కట్టవాసుల వినతి

మొయినాబాద్ రూరల్: మండలంలోని తోల్‌కట్ట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు గ్రామస్తులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై పలుమార్లు మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని తెలిపారు. ఎక్స్ సర్వీస్‌మెన్ల పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. కొంతమంది బడాబాబులకు అసైన్డ్ పట్టాలు, పాసు పుస్తకాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. పేదలు సాగు చేసుకునేందుకు మాత్రం అనుమతించడం లేదని మండిపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ఒకే సర్వే నంబర్‌లోని భూమిని ఇద్దరు సోదరుల్లో ఒకరికి పట్టా చేసి, మరొకరికి లావణి పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. భూభారతిలోనైనా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్తులు భిక్షపతి, జంగయ్య, మల్లయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- అక్కడికక్కడే ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి (40) డీసీఎం వాహనంలో పౌల్ట్రీ దాణా వేసుకుని డ్రైవర్ నునావత్ గణేశ్‌తో కలిసి గురువారం తెల్లవారుజామున 5గంటలకు ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ ఎగ్జిట్ నంబర్ 11 వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో యాదగిరికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ గణేశ్ గాయాలతో బయటపడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆటోడ్రైవర్ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- రాజేంద్రనగర్ పోలీసులు చిత్రహింసలకు గురి చేసినందునే...
- పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసు స్వీకరణ
- రెండు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని డీజీపీకి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: పోలీసు కస్టడీలో హింసకు గురై వ్యక్తి మరణించాడనే ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై పత్రికలు, టీవీ చానళ్లలో వచ్చిన వార్తల ఆధారంగా తాము సుమోటోగా కేసు స్వీకరించినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. వివరాలివీ... 'హైదరాబాద్ రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్(35), అతని భార్యకు మధ్య కొన్ని మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో 2025 మే 13న ఆటో డ్రైవర్‌ను అతని భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. దంపతులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌ను ఒక గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ పోలీసులు అతడిని రబ్బరు బెల్టుతో తీవ్రంగా కొట్టారు. గంట తర్వాత అతడిని పోలీసులు వదిలి పెట్టారు. పోలీస్ స్టేషన్ బయటికి రాగానే వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను మరణించారని వైద్యులు ధ్రువీకరించారు'. ఈ కథనాలను పరిగణలోకి తీసుకుని సుమోటోగా కేసును స్వీకరించినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఈ విషయాన్ని డీజీపీకి జారీ చేసిన నోటీసుల్లోనూ స్పష్టం చేసింది. మీడియాలో వచ్చినది నిజమైతే ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పష్టం చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలని డీజీపీని ఆదేశించింది.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

షాబాద్: ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి లోని ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన నక్కలపల్లి గణేశ్ (25) హైతాబాద్‌లోని వెల్స్‌పన్ కంపెనీలో పనిచేసేవాడు. బుధవారం సాయంత్రం కటింగ్ చేయించుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తల్లి మాణమ్మ చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం పక్కపొలం వారు మీ గణేశ్ బైక్ పొలం వద్ద ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తల్లి మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా రెండు రోజులుగా మనోవేదనతో బలవన్మరణానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

మరో ఘటనలో మనస్తాపంతో..



చంద్రశేఖర్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్ : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండని జంగయ్య, కొండని వెంకటయ్య సోదరులకు భూ తగాదాలు ఉన్నాయి. జంగయ్య చనిపోవడంతో ఆయన కుమారుల మధ్య వివాదం కొనసాగుతోంది. జంగయ్య కుమారులు తమకు రావాల్సిన పొలాన్ని ఇవ్వడం లేదని వెంకటయ్య కుమారులు పలుమార్లు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో జంగయ్య కుమారులు వెంకటయ్య కుటుంబ సభ్యులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు రావాల్సిన భూమి ఇవ్వకపోగా తమపైనే కేసులు బనాయించారన్న మనస్తాపంతో వెంకటయ్య కుమారుడు చంద్రశేఖర్ (25) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శరత్ కుమార్ తెలిపారు.

మోతాదు మించొద్దు



షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడలో పత్తి సాగులో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- ఎరువులు, పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అధికంగా వాడితే భూసారానికి ముప్పు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిపై దృష్టి సారించాలి
- అవగాహన సదస్సుల్లో శాస్త్రవేత్తలు, అధికారులు

షాబాద్: ఖరీఫ్‌లో పత్తి సాగు చేసే రైతులు తగిన మోతాదులో ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అవసరానికి మించి వినియోగించడం వలన పెట్టుబడులు పెరగడంతో పాటు భూసారం దెబ్బతింటుందని వివరిస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ సదస్సుల్లో కర్షకులకు అవగాహన కల్పిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా గడిచిన ఐదేళ్లుగా రైతులకు సరైన దిగుబడులు దక్కలేదు. దీంతో వరుస నష్టాలు చవిచూశారు. ఈ క్రమంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పెట్టుబడులు అదుపులో ఉంచుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖఅధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే మార్గాలపై దృష్టిపెట్టాలని అవగాహన కల్పిస్తున్నారు.

వినియోగం ఇలా..

ఎకరా పత్తి సాగుకు పొలం దున్నే సమయంలో 50 కిలోల డీఏపీ చల్లుకోవాలి. విత్తనం నాటిన 20, 40, 60 రోజులకు మూడు సార్లు మొత్తం 90 కిలోల యూరియాను వర్షం పడిన సమయంలో వేయాలి. 25 కిలోల పోటాష్ ఎరువును విత్తనం నాటిన 60 రోజులకు యూరియాతో కలిపి వేసుకోవాలి. కానీ రైతులు రెండింతల ఎరువులు వినియోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

సూచనలు పాటించాలి



రైతులు దిగుబడిపైనే కాకుండా పొలాల్లో భూసారాన్ని కాపాడుకోవడంపై కూడా దృష్టిసారించాలి. అవసరానికి మించి రసాయన ఎరువులు వాడొద్దు. పురుగు మందుల వినియోగంలో అధికారుల సూచనలు పాటించాలి.

– వెంకటేశం, వ్యవసాయశాఖ అధికారి, షాబాద్

ఏసీబీ వలలో అవినీతి చేపలు!

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తూంకుంట మున్సిపల్ సిబ్బంది

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ సిబ్బంది లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాలివీ... తూంకుంట మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన శామీర్‌పేట వార్డులో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌లు రూ. 20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శామీర్‌పేట వార్డు పరిధిలో ఓ వ్యక్తి రెండు ఇళ్లను కొనుగోలు చేసి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఏడాదిన్నరగా మ్యుటేషన్ కోసం అధికారుల చుట్టూ తిరిగాడు. శామీర్‌పేట వార్డు ఆఫీసులో పని చేసే బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌లు లంచం డిమాండ్ చేశారని, దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్నామన్నారు. ఈ కేసులో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒక స్థలం.. డబుల్ రిజిస్ట్రేషన్.. ప్లాట్ విక్రయించిన వ్యక్తి అరెస్టు

దుండిగల్: ఒకే స్థలాన్ని రెండు సార్లు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... మల్లంపేట ప్రాంతానికి చెందిన జె.అశోక్ కుమార్ అలియాస్ సారా అశోక్ స్థానికంగా ఉన్న 195, 196వ సర్వే నెంబర్లలోని 9.39 గుంటల్లో గతంలో వెంచర్ వేశాడు. మౌలాలికి చెందిన అన్వర్ ఖాతూన్ అనే మహిళ బాచుపల్లికి చెందిన మోహన్‌రెడ్డి సహకారంతో 1986 సంవత్సరంలో సదరు వెంచరులో ప్లాట్‌ను కొనుగోలు చేసింది. కొన్నాళ్ల వరకు ఖాతూన్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులు ప్లాట్ వద్దకు రాలేదు. ఇది గమనించిన అశోక్ నా ప్లాట్‌ను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నాడు. అందులో భాగంగా 2004 సంవత్సరంలో అశోక్ సదరు స్థలాన్ని మోహన్‌రెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. 2023లో ఖాతూన్ ఆమె కుటుంబ సభ్యులు ప్లాట్ వద్దకు రావడంతో మోసం వెలుగుచూసింది. మోహన్‌రెడ్డి పేరుపై ప్లాట్‌ను మార్చినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన అశోక్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. గురువారం అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అశోక్‌కుమార్‌తో పాటు ఇతరుల పాత్ర ఏమైనా ఉందా.. ఇలాంటి దొంగ రిజిస్ట్రేషన్లు ఇంకేమైనా చేశాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడ్డ మేకల దొంగలు

కొందుర్గు: మేకలు ఎత్తుకెళ్తున్న దొంగలు పట్టుబడ్డ సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బంగారు జంగయ్య పొలం నుంచి బుధవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్తుండగా స్థానికులు పట్టుకున్నారు. వారిని విచారించగా కొందుర్గుకు చెందిన వంశీ, హరికృష్ణ, ప్రశాంత్ అని తేలింది. జంగయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. ఆమనగల్లు పట్టణంలోని నుగుల బండ కాలనీకి చెందిన మల్లేశ్ (35) గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన బంధువుల వివాహానికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తిరిగి వస్తుండగా వెల్దండ మండల కేంద్రం సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

యాచారం: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడకు చెందిన గౌర శ్రీకాంత్(22) బుధవారం అర్ధరాత్రి గునుగల్ గేట్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. అతివేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఇందిరానగర్ సమీపంలో అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాంత్ స్పాట్‌లోనే చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

వీధి కుక్కల దాడి

- 250 నాటుకోళ్లు మృత్యువాత
- రూ.2 లక్షలకు పైగా నష్టం



వీధి కుక్కల దాడిలో చనిపోయిన నాటుకోళ్లు

నందిగామ: వీధికుక్కల దాడిలో 250 నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి. రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. వివరాలివీ.. మండల పరిధిలోని రంగాపూర్‌కు చెందిన వన్నల్లి మల్లేశ్ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. ప్రస్తుతం ఈ షెడ్డులో సుమారు 300 వరకు కోళ్లు పెరుగుతున్నాయి. బుధవారం రాత్రి వాటికి దాణా వేసి షెడ్డుకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వెళ్లి చూసే సరికి సుమారు 250 కోళ్లు మృతి చెంది కనిపించాయి. షెడ్డు పక్కన ఉన్న ఇనుప జాలీని కింది నుంచి తొలగించిన కుక్కలు లోనికి ప్రవేశించి కోళ్లను కొరికివేసినట్లు గుర్తించాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

అటవీ భూమి కబ్జా

- ఇస్మాయిల్‌పూర్‌లో ఐదు ఎకరాల్లో విత్తనాలు నాటిన రైతులు
- అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
- ఆందోళనకు దిగిన అన్నదాతలు

బషీరాబాద్: మండలంలోని మైల్వార్ రిజర్వుడు ఫారెస్టులో 5 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. నీళ్లపల్లి ఫారెస్టు సెక్షన్‌లోని సర్వేనంబర్ 20లో ఇస్మాయిల్‌పూర్ తండాకు చెందిన బలరాం నాయక్, రెడ్యానాయక్, భీమ్లానాయక్ గుట్టుచప్పుడు కాకుండా విత్తనాలు నాటారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ ఫారెస్టు సెక్షన్ అధికారి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప గురువారం అక్కడికి చేరుకొని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇదే భూమి విషయం కోర్టులో కేసునడిచింది. కొన్ని నెలల తర్వాత అవీ అటవీ భూములేనని కోర్టు కూడా తీర్పు ఇచ్చిందని వ్యవసాయ అధికారులు గుర్తు చేశారు. అటవీ భూములు కబ్జా చేసి సాగు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వెంటనే ఆ భూముల్లో గోతులు తీయించారు. త్వరలో మొక్కలు నాటుతామని అధికారులు తెలిపారు.

రైతుల వాగ్వాదం

కబ్జాకు గురైన భూమిని స్వాధీనానికి వెళితే సాగు చేసిన రైతులు వారిపై గొడవకు దిగారు. తాము ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నామని తమ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికారులు కేసులు పెడుతామని హెచ్చరించడంతో రైతులు వెనుకంజ వేశారు.

సిందూర్ సాహసోపేతమైన చర్య: లక్ష్మణ్

సాక్షి, సిటీబ్యూరో: ఆపరేషన్ సిందూర్ ఎంతో సాహసోపేతమైన చర్య అని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, విజయాలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, యోగా దివస్ అజెండాలతో బీజేపీ గోల్కొండ జిల్లా నేతలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... మోదీ దేశ పౌరుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఉగ్రదాడులకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనతో పోల్చితే దేశంలో ఐఐటీలు, ఐఐఎం, ఎయిమ్స్ సంఖ్య రెట్టింపయ్యాయని, మెడికల్ సీట్లు గణనీయంగా పెరిగాయన్నారు. 52 కోట్ల మందికి ముద్ర రుణాలు ఇచ్చామన్నారు. మేకిన్ ఇండియా సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేంద్ర మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు కేంద్ర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 21న యోగా దివస్ నిర్వహించుకుందామని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సురేఖ, ప్రేమ్ సింగ్ రాథోడ్, అట్లూరి రామకృష్ణ, ఉమా రాణి, కోలా దీపక్, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ అడిగారని 'ట్రాక్స్'పై పగ!

రైలు నుంచి దించినందుకు విధ్వంసాలకు కుట్ర

- ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ నకిలీ బాబా వ్యవహారం
- హైదరాబాద్‌తో పాటు తమిళనాడులోనూ కేసులు
- అరెస్టు చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు



నిందితుడు ఓంను అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడులోనూ రైలు పట్టాలపై రాళ్లు, రాడ్లు, కర్రలు పెట్టి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో (ఆర్పీఎఫ్) సహా జాతీయ దర్యాప్తు సంస్థనూ (ఎన్ఐఏ) పరుగులు పెట్టించిన నకిలీ బాబా చిక్కాడు. ఇతగాడిని తెలంగాణ ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేయగా... చెన్నై అధికారులు పీటీ వారెంట్‌పై అక్కడకు తరలించారు.

- ఉత్తరాఖండ్‌కు చెందిన విజయ్‌కుమార్ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. బతుకుతెరువు కోసం ఒడిస్సాలో స్థిరపడిన ఇతగాడు కుటుంబాన్ని వదిలేసి హఠాత్తుగా బాబా అవతారం ఎత్తాడు. తన పేరును ఓంగా మార్చుకుని దేశ సంచారం మొదలుపెట్టాడు. భిక్షాటన చేసుకుంటూ జీవించడం, కనిపించిన రైలు ఎక్కడం, నచ్చిన చోట దిగడం, ప్లాట్‌ఫామ్స్‌పై దొరికినవి తినడం ఇవే దినచర్యలుగా కొన్నేళ్లు బతికేశాడు.
- రైళ్లు, రైల్వే ప్లాట్‌ఫామ్స్‌పై ఇలాంటి బాబాలు, భిక్షాటన చేసే వాళ్లు, హిజ్రాల బెడద పెరిగిపోతున్నాయంటూ ప్రయాణికుల నుంచి రైల్వే అధికారులకు వరుస ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న ఇలాంటి వాళ్లను ఉపేక్షించవద్దని రైల్వే ఉన్నతాధికారులు స్పష్టమన ఆదేశాలను జారీ చేశారు.
- అప్పటి నుంచి టీసీలు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు ఇలాంటి వాళ్లు ఎక్కడ కనిపించినా టిక్కెట్ తనిఖీ చేయడం, లేకపోతే దింపేయడం లాంటివి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైలులో ఒడిస్సా నుంచి హైదరాబాద్ వస్తున్న ఓం బాబాను టిక్కెట్ లేని కారణంగా టీసీ మార్గమధ్యంలో దింపేశారు. ఈ విషయంలోనే ఓం బాబా హర్ట్ అయ్యాడు. దీంతో ఏకంగా రైల్వేల పైనే కక్ష పెంచుకున్నాడు.
- నగరంలోని కాచిగూడ–బుద్వేల్ మధ్య రైలు పట్టాలపై పెద్ద కర్రలు, రాళ్లు పెట్టాడు. వీటిని గుర్తించిన గ్యాంగ్‌మెన్లు తొలగించి, ఆర్పీఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన అధికారులు నిందితుడిని పట్టుకునేందుకు మఫ్టీలో రంగంలోకి దిగడంతో పాటు గ్యాంగ్‌మెన్లను అప్రమత్తం చేశారు.
- కాటేదాన్ ప్రాంతంలో రైలు పట్టాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓంను గుర్తించిన ఆర్పీఎఫ్ అతడిని అదుపులోకి తీసుకుంది.
- విచారణ నేపథ్యంలో ఈ నేరాలు తానే చేసినట్లు అతడు అంగీకరించడంతో అరెస్టు చేసి జైలుకు పంపారు.
- నగరంలో ఈ పని చేసి, అరెస్టు కావడానికి మధ్యలో చెన్నై వెళ్లిన ఓం అక్కడా ఇలాంటి పనే చేశాడు. విల్లివాక్కం, అంబత్తూరు, ఆవడి, అరక్కోణంలలో రైలు పట్టాలపై వస్తువులు పెట్టడంతో ఐదు కేసులు నమోదయ్యాయి.
- ఈ ఏడాది ఏప్రిల్ 26 ఉదయం 9.30 గంటలకు అవడి రైల్వే యార్డ్ వద్ద సిగ్నల్ ఆపరేషన్ విఫలమైంది. రైల్వే సిబ్బంది వెంటనే ట్రాక్‌ను పరిశీలించగా ఐరన్ పెండ్రాల్ క్లిప్‌లు తొలగించినట్లు గుర్తించారు. క్లిప్‌లు, రెండు అంగుళాల ఇనుప ముక్కలను ట్రాక్‌పై ఉంచినట్లు తేల్చారు.
- మరుసటి రోజు రాత్రి 7 గంటలకు అరక్కోణం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆరు పాయింట్ల వద్ద బ్యాలస్ట్, ఇనుప ముక్కలు కనిపించాయి. అదే రోజు రాత్రి 11.47 గంటలకు అంబత్తూరు రైల్వే స్టేషన్‌లో ఐదు చోట్ల బ్యాలస్ట్‌లు ఉంచినట్లు ఆర్పీఎఫ్‌కి సందేశం వచ్చింది.
- రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై బ్యాలస్ట్‌ను తొలగించి, ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఇక్కడి అధికారుల విచారణలో ఈ విషయాలు వెలుగులోకి రావడంతో చెన్నై ఆర్పీఎఫ్ అధికారులకు సమాచారం ఇచ్చారు.
- దీంతో ఓంపై అక్కడి కోర్టు నుంచి ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ తీసుకొచ్చిన అధికారులు చెన్నై తరలించారు.
- తమిళనాడులో ఇతడు చేసిన పనితో ఎన్ఐఏ కూడా ఉలిక్కిపడింది. దీని వెనుక ఉగ్రకోణం ఉందని అనుమానించి రంగంలోకి దిగింది. చివరకు ఇది ఓ దొంగ బాబా పనిగా తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.